క్లుప్తంగా

అంగన్‌వాడీ సహాయకులకు నియామక పత్రాలు



నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి/మలికిపురం: సఖినేటిపల్లి మండలం మోరి, సఖినేటిపల్లి లాకుపేట, ఆనంద్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాలకు సహాయకులుగా శేరు భవాని, ఎస్.సుమ, ఎన్.మౌనిక నియమితులయ్యారు. వారికి కత్తిమండలోని తన క్యాంపు కార్యాలయం వద్ద రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు గురువారం నియామక పత్రాలు అందజేశారు. చిన్నారులకు సక్రమంగా సేవలందించాలని వారికి సూచించారు. పరిషత్ కో ఆప్షన్ మెంబర్ బళ్ళ నోబుల్ ప్రభాకర్, పీఏసీఎస్ అధ్యక్షుడు రుద్రరాజు రంగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పీర్ల చెరువు రోడ్డును చక్కదిద్దారు

మామిడికుదురు: నగరం పీర్ల చెరువు రోడ్డును అధికారులు చక్కదిద్దారు. రోడ్డు పాడైపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానిక రైతులు ఇటీవల తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు విన్నవించారు. ఆ రోడ్డును పరిశీలించి తహసీల్దార్‌తో పాటు సర్పంచ్ జాలెం రమణకుమారి, పంచాయతీ కార్యదర్శి తాడి ఏసుబాబు స్వయంగా పరిశీలించి, రైతుల అవస్థలను గమనించారు. జేసీబీతో ఆ రోడ్డును గురువారం చక్కదిద్దారు. దీనిపై రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

వేసవి సెలవుల్లో టీచర్లు అందుబాటులో ఉండాలి

అంబాజీపేట: వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులు ఫోన్లకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంఈఓ జేవీ కనకదుర్గ అన్నారు. పాఠశాలల సామాజిక తనిఖీపై జెడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ మాట్లాడుతూ, ప్రతి ఉపాధ్యాయుడూ ఫైనల్ పరీక్షల మార్కులను సిద్ధం చేసి, ప్రోగ్రెస్ రిపోర్టులు తయారు చేయాలని ఆదేశించారు. వర్క్‌బుక్‌లు తదితర పనులు పూర్తి చేయాలన్నారు. పేరెంట్స్ కమిటీతో ఈ నెల 29 లోగా సమావేశం నిర్వహించాలని సూచించారు. పాఠశాల స్థితిగతులు, మౌలిక వసతులు, మంచినీటి సదుపాయం, టాయిలెట్లు, కిచెన్ షెడ్, ప్రహరీ తదితర అంశాలపై పేరెంట్స్ కమిటీతో చర్చించాలన్నారు. డీఆర్పీ సీహెచ్‌వీవీ సూర్యలక్ష్మి, సీఆర్పీలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మామిడికుదురు: ప్రముఖ పారిశ్రామికవేత్త సోమిశెట్టి ఆంజనేయులు నాగలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యాన నగరంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ జాలెం రమణకుమారి గురువారం ప్రారంభించారు. 216వ నంబర్ జాతీయ రహదారి పక్కన లక్ష్మీ ఆంజనేయ మీడోస్ వద్ద దీనిని ఏర్పాటు చేశారు. ఏటా వేసవిలో చల్లని మజ్జిగ అందిస్తున్నామని ఆంజనేయులు చెప్పారు.

భారీ తాగునీటి ప్రాజెక్టుకు నేడు శంకుస్థాపన

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో రూ.17,33,88,000తో నిర్మించనున్న భారీ తాగునీటి ప్రాజెక్టుకు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు గురువారం ఈ విషయం తెలిపారు. తీరప్రాంత గ్రామాలైన పల్లిపాలెం, అంతర్వేది దేవస్థానం, అంతర్వేదికర, గొంది గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ మంజూరు చేసిందని చెప్పారు.

కళాకారులను ఆదుకోవాలి

రాజోలు: రాష్ట్రవ్యాప్తంగా బ్యాండ్, ఆర్కెస్ట్రా సింగర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర సాంస్కృతిక కళాకారుల సంఘం గౌరవాధ్యక్షుడు చుట్టుగుళ్ల సత్యనారాయణ కోరారు. స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో సంఘం కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా చుట్టుగుళ్ల సత్యనారాయణ, అధ్యక్షుడిగా శెట్టి విజయకుమార్, ఉపాధ్యక్షుడిగా మొగలపు సుజాత, ప్రధాన కార్యదర్శిగా ఆర్.కమల, ప్రచార కన్వీనర్‌గా కె.ఏసురత్నం ఎన్నికయ్యారు.

యోగా ఆశ్రమ సభ్యుల రక్తదానం

రావులపాలెం: అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురికి స్థానిక శ్రీ స్వామి వివేకానంద యోగా ఆశ్రమం సభ్యులు రక్తదానం చేశారు. సభ్యులు గురువారం ఆస్పత్రికి వెళ్లి 11 మందికి అవసరమైన రక్తాన్ని దానం చేసినట్టు యోగా గురువు శ్రీనివాస్ తెలిపారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

అంబాజీపేట: వక్కలంక సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని సర్పంచ్ వాసంశెట్టి రేవతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె, ఎంపీడీఓ ఐ.రత్నంరాజు మాట్లాడుతూ, గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేస్తున్న ఆధార్ నమోదు కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సాయిబాబా

ఆలమూరు: బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా కాలా సాయిబాబా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సూర్యారావుపేటలో గురువారం జరిగిన సంఘం మండల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బడులకు భద్రత

- ప్రభుత్వ, జెడ్పీ హైస్కూళ్లకు నైట్ వాచ్‌మన్‌ల నియామకం
- ప్రభుత్వ ఉత్తర్వులపై ఉపాధ్యాయుల హర్షం

నియోజకవర్గాల్లో పాఠశాలల వివరాలు

నియోజకవర్గం	హైస్కూళ్లు
కొత్తపేట	37
పి.గన్నవరం	45
రాజోలు	33
మొత్తం	115



కొత్తపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాల

కొత్తపేట: కొత్తపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గత ఏడాది అక్టోబర్ 1వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల వరండా, హెచ్‌ఎం గది తాళాలు పగులగొట్టిన దుండగులు బీరువాలో భద్రపరిచిన రూ.1.40 లక్షల విలువైన రెండు ల్యాప్‌టాప్‌లు దొంగిలించుకుపోయారు. గతంలో కూడా ఇదే పాఠశాలలో టీవీ, మోటార్, హ్యాండ్‌పైపు హెడ్ తదితర వస్తువులు చోరీ అయ్యాయి. ఇదేవిధంగా పలు పాఠశాలల్లో ఎంతో విలువైన వస్తువులను దుండగులు అపహరించుకుపోయారు. ఎన్నో ఏళ్లుగా నైట్ వాచ్‌మన్‌లు లేకపోవడంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ఇన్నాళ్లూ రక్షణ లేకుండా పోయింది. ఇదే అదనుగా పలువురు దుండగులు వివిధ పాఠశాలల్లో చోరీలకు పాల్పడేవారు. కంప్యూటర్లు, డిజిటల్ పాఠాలకు వినియోగించే ప్రొజెక్టర్లు, ప్రింటర్లు, విద్యుత్ పరికరాల వంటి విలువైన సామగ్రిని చోరీ చేసేవారు. ఆ సామగ్రి రికవరీ కాక, విద్యార్థులకు డిజిటల్ విద్య కూడా సక్రమంగా అందని దుస్థితి. దీనికితోడు కొన్నిచోట్ల రాత్రి వేళల్లో మందుబాబులు, జూదరుల అసాంఘిక కార్యకలాపాలకు పాఠశాల ప్రాంగణాలు, తరగతి గదులు నిలయాలుగా ఉండేవి. మద్యం మత్తులో మందుబాబులు, ఆకతాయిలు పాఠశాలల ఆస్తులను ధ్వంసం చేసిన ఘటనలూ అనేకం ఉన్నాయి. పశువులు పాఠశాలల ఆవరణలోకి చొరబడి పచ్చని మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. వీటన్నింటినీ ఉపాధ్యాయులు భరిస్తూ వచ్చారు. పలువురు ఉపాధ్యాయులు సెలవు రోజుల్లో సైతం పగటి పూట హైస్కూళ్లకు వచ్చి పరిస్థితిని గమనించేవారు. రాత్రి పూట రాలేరు కదా! ఈ పరిస్థితుల్లో జెడ్పీ ఉన్నత పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు నైట్ వాచ్‌మన్‌లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల ఉత్తర్వులు కూడా జారీ చేసింది. దీనిపై ఉపాధ్యాయులు ముఖ్యంగా ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికులకు ప్రాధాన్యం

హైస్కూళ్లకు నైట్ వాచ్‌మన్‌ల నియామకంలో స్థానికులకు ప్రాధాన్యం ఇస్తారు. ముఖ్యంగా ఆయా పాఠశాలల్లో పని చేసే ఆయా భర్తకు లేదా మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల్లో ఒక మహిళ భర్తకు తొలి ప్రాధాన్యం ఇస్తారు. వారు కాకపోతే 60 ఏళ్ల లోపు వయసున్న ఎక్స్ సర్వీస్‌మన్ లేదా పేరెంట్స్ కమిటీ ఎంపిక చేసే వ్యక్తిని నియమించాలని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. దీని ప్రకారం హెచ్‌ఎంలు తమ హైస్కూళ్లలో నైట్ వాచ్‌మన్‌లను నియమించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

సంతోషం



ప్రభుత్వ హైస్కూళ్ల ఆస్తుల పరిరక్షణకు నైట్ వాచ్‌మన్‌లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం చాలా సంతోషంగా ఉంది. గతంలో మా పాఠశాలలో పలుమార్లు గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి విలువైన వస్తువులు దొంగిలించుకుపోయారు. ఎప్పటికప్పుడు పోలీసులకు ఫిర్యాదులు చేశాం. పాఠశాల సంరక్షణ, ఆస్తుల పరిరక్షణకు నైట్ వాచ్‌మన్ ఆవశ్యకతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఎట్టకేలకు మే 1 నుంచి వాచ్‌మన్‌లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడం హర్షణీయం. ఆ మేరకు నియామకం కూడా పూర్తి చేశాం.

– పి.ఇందిరాబాయి, హెచ్‌ఎం, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, కొత్తపేట

విద్యుత్ సరఫరాకు పలు ప్రాంతాల్లో నేడు అంతరాయం

మలికిపురం/రాజోలు/సఖినేటిపల్లి/మామిడికుదురు/కొత్తపేట: వివిధ ఫీడర్ల పరిధిలో మరమ్మతులు, నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం వివిధ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తున్నారు. ఏపీ ఈపీడీసీఎల్ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్, ఏఈ శ్రీనివాస్ గురువారం ఈ విషయం తెలిపారు.

- రాజోలు సబ్‌స్టేషన్, పొన్నమండ 33 కేవీ ఫీడర్, నగరం, మగటపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో పనుల నిమిత్తం రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల్లోని పలు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.
- కొత్తపేట మండలం బిళ్లకుర్రు, వానపల్లి, అవిడి, మోడేకుర్రు, పలివెల, గంటితో పాటు కొత్తపేటలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదు.

సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని, ప్రజలందరూ సీఎంగా ఆయనకే మరోసారి సంపూర్ణ మద్దతు పలుకుతారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. కె.జగన్నాథపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం వైఎస్సార్ సీపీ నాయకుడు మేడిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యాన గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు, పి.గన్నవరం నియోజకవర్గ అబ్జర్వర్ కర్నాసుల సీతారామాంజనేయులు ఇంటింటికీ వెళ్లి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సరిగా అందుతున్నాయో లేదో ఆరా తీశారు. డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి, ఎంపీటీసీ సభ్యురాలు జలగం హేమలత, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. శానపల్లిలంక పీఏసీఎస్ వద్ద చైర్మన్ మట్టపర్తి రామారావు ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రారంభించారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి



పళ్లాలమ్మ దేవస్థానం పాలక మండలితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- ఘనంగా పళ్లాలమ్మ దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం

కొత్తపేట: వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారి ఆలయం అభివృద్ధికి పాలక మండలి కృషి చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సూచించారు. నూతన పాలక మండలి చైర్మన్‌గా కామిశెట్టి అమ్మన్న, ధర్మకర్తలుగా సబ్బితి సత్యనారాయణ, కంచుస్తంభం లక్ష్మి, ఒగ్గు సత్యవతి, కట్టా పద్మ, వానపల్లి శ్రీనివాసరావు, ఇళ్ల రాంబాబు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా వడ్లమూరి సత్తిరాజు (ఆసాది) గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జగ్గిరెడ్డి.. పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే ఆలయం ముఖ మండప నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయని, వాటిని నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. వచ్చే నెల తొలి వారంలో అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని అన్నారు. నూతన చైర్మన్ అమ్మన్న మాట్లాడుతూ, భక్తులకు తగిన సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయ కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేసే విధంగా కృషి చేస్తామని అన్నారు. తనను చైర్మన్‌గా నియమించినందుకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సభలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, డీసీసీబీ పర్సన్ బండారు రాజా, ఎంపీటీసీ సభ్యురాలు దుప్పలపూడి సత్యవేణి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, పార్టీ గ్రామ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, దేవస్థానం ఈఓలు బి.వెంకటేశ్వరరావు, నడింపల్లి ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, శిశు సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి

అంగన్‌వాడీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం గ్రామాల్లో అమలు చేస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకునేలా కార్యకర్తలు, సహాయకులు చిత్తశుద్ధితో పని చేయాలని విప్ జగ్గిరెడ్డి ఆదేశించారు. కొత్తపేట రామాలయం వీధి, గంటి ఎస్సీ పెదపేట, ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి శెట్టిబలిజ రామాలయం అంగన్‌వాడీ కేంద్రాల నూతన సహాయకులకు ఆయన గురువారం నియామక పత్రాలు అందించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ పి.శారద తదితరులు పాల్గొన్నారు.

అగ్రగామిగా కొత్తపేట నియోజకవర్గం



ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూనే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అన్ని విధాలా అగ్రగామిగా తీర్చిదిద్దామని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. చెముడులంకలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యాన తొలి విడత గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధికార వ్యామోహంతో గ్రామాల్లో కులాల కుంపట్లు రాజేసేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నవరత్నాల ద్వారా గ్రామంలోని లబ్ధిదారులకు రికార్డు స్థాయిలో రూ.6.68 కోట్ల మేర లబ్ధి చేకూర్చామని చెప్పారు. అనంతరం రూ.20 లక్షలతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కోట్లాది రూపాయలతో మేజర్ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించడం ద్వారా గ్రామ రూపురేఖలు మార్చివేసిన విప్ జగ్గిరెడ్డికి సర్పంచ్ తమ్మన నేతృత్వంలో పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యులు తోరాటి సీతామహాలక్ష్మి, ఎంఏఏఎస్ అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల ఉన్నతికి సీఎం జగన్ పెద్దపీట



నూతన కార్యవర్గానికి సత్కారం

అయినవిల్లి: వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సొసైటీ) ద్వారా రైతుల ఉన్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. నేదునూరు పీఏసీఎస్ చైర్మన్‌గా జోగి బాబ్జీ, డైరెక్టర్లు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న చిట్టిబాబు, ఇజ్రాయిల్ మాట్లాడుతూ, సొసైటీల ద్వారా రైతులకు ప్రభుత్వం అనేక ప్రయోజనాలు కల్పిస్తోందన్నారు. వారిని గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ కర్నాసుల సీతారామాంజనేయులు, సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు క్లోపల్లి సుబ్బరాజు, ఇందుగుల వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి చేయూత

మలికిపురం: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఇరుసుమండ అంగన్‌వాడీ కేంద్రానికి లక్కవరం ఎస్‌బీఐ ఒక టీవీ, ట్యాబ్, కుర్చీలు అందించింది. బ్యాంక్ రీజినల్ మేనేజరు ఎస్.సుగుణరావు చేతుల మీదుగా వీటిని అందించినట్టు మేనేజర్ రామకృష్ణ గురువారం తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

పి.గన్నవరం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యర్రంశెట్టివారిపాలేనికి చెందిన యర్రంశెట్టి నాగేశ్వరరావు కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ గురువారం అందజేశారు. పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు..

రావులపాలెం: గ్రామానికి చెందిన కంకటాల నాగరాజు, లీలావతి దంపతులు కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. వారికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు గురువారం రూ.15,500 ఆర్థిక సాయం అందజేశారు.

వేదశాస్త్ర ప్రవర్ధక వార్షికోత్సవం ప్రారంభం

అంబాజీపేట: శ్రీ గోదావరీ మండలి వేదశాస్త్ర ప్రవర్ధక సభా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన 72వ వార్షికోత్సవం తొండవరంలో ఆకెళ్ల సూర్యనారాయణాధాని నివాసంలో గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వేద, శాస్త్ర, శ్రౌత, స్మార్త, అపర, ఆగమ విద్యల్లో విద్యార్థులకు 29వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహించి, పట్టాలు ఇవ్వనున్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు చిలావఝుల వెంకట సూర్యనారాయణమూర్తి, కార్యదర్శి ఆకెళ్ల వెంకట రామకృష్ణ కామేశ్వరశర్మ, కోశాధికారి అయ్యగారి లక్ష్మీనరసింహమూర్తి ఈ విషయం తెలిపారు. ఈ పరీక్షలకు ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరవుతారన్నారు. అనంతరం చిర్రావూరి శ్రీరామశర్మ ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయని తెలిపారు.

స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహిద్దాం

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలని భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని పందిరి రాట ముహూర్తం గురువారం నిర్వహించారు. ఈ నెల 30న స్వామి వారి దివ్య కల్యాణం, మే 1న తీర్థం నిర్వహించనున్నామని తెలిపారు. కోనసీమలోని భక్తులందరూ ఈ ఉత్సవానికి తరలి రావాలని కోరారు.

ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలల ప్రతిభ



గుబ్బల గీతామల్లేశ్వరి



కామాడి శ్రీదుర్గా మణిమాల



కంచి హేమంత్ వెంకటసాయి



పి.పావని



బి.జాస్మిన్



టి.ప్రమీల

మామిడికుదురు: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. మామిడికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎస్ఎస్ యేసుబాబు గురువారం తెలిపారు. బైపీసీలో గుబ్బల గీతామల్లేశ్వరి 948 మార్కులతో ప్రథమ స్థానం సాధించిందన్నారు. తర్వాతి స్థానాల్లో కామాడి శ్రీదుర్గా మణిమాల (939), కంచి హేమంత్ వెంకటసాయి (904) సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరంలో 68.91 శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. 74 మంది విద్యార్థులకు 51 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఫలితాల్లో మామిడికుదురు రెండో స్థానంలో, కోనసీమ జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందని వివరించారు.

990 మార్కులు సాధించిన దత్తశ్రీ

అంబాజీపేట: గంగలకుర్రుకు చెందిన జయను బుల్లియ్యనాయుడు, విజయలక్ష్మి దంపతుల కుమార్తె భవ్యదత్తశ్రీ ఎంపీసీలో ఏకంగా 990 మార్కులు సాధించింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, లెక్చరర్ల గైడెన్స్‌తో ఈ మార్కులు సాధించానని ఆమె తెలిపింది. బీటెక్‌లో మంచి మార్కులతో ఇంజినీరింగ్ పూర్తి చేయడమే తన లక్ష్యమని చెప్పింది. ఆమె తండ్రి చిరు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి గృహిణి. దత్తశ్రీ అన్నయ్య బీటెక్ పూర్తి చేశాడు. దత్తశ్రీని పలువురు అభినందించారు.

అనుపమకు 985 మార్కులు

మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ ప్రభుత్వ ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థిని చింతా అనుపమ సెకండియర్‌లో విశేష ప్రతిభ కనబరిచింది. వెయ్యికి 985 మార్కులు సాధించింది. కళాశాలలో జరిగిన సభలో కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్స్ తోరం సతీష్, ముప్పర్తి బాబులు, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

ప్రతిభ చూపిన పేద విద్యార్థులు

రాజోలు: ప్రతిభకు పేదరికం అడ్డం కాదని నిరూపించారు రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల విద్యార్థులు. రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని పి.పావని ఎంపీసీలో 957 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే గురుకుల బాలికల కళాశాల విద్యార్థిని బి.జాస్మిన్ ఎంపీసీలో 964, టి.ప్రమీల బైపీసీలో 961 మార్కులు సాధించారు. పరీక్షలకు 61 మంది హాజరు కాగా 55 మంది ఉత్తీర్ణులయ్యారు.

రావులపాలెంలో..

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో 36 శాతం, సెకండియర్‌లో 59 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ తెలిపారు. ఫస్టియర్ 202 మందికి గాను 73 మంది, సెకండియర్‌లో 184 మందికి గాను 109 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు.



గంగలకుర్రులో భవ్యదత్తశ్రీకి స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు



మలికిపురంలో అనుపమను అభినందిస్తున్న కరస్పాండెంట్ సత్యనారాయణమూర్తి, అధ్యాపకులు

43 శాతం ఉత్తీర్ణత

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 43 శాతం ఉత్తీర్ణత సాధించిందని ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాదరెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు 63 మంది రాయగా 27 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. బైపీసీలో 918 మార్కులతో స్వాతి కళాశాల టాపర్‌గా నిలిచింది. ప్రథమ సంవత్సరం పరీక్షలు 62 మంది రాయగా వీరిలో 14 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

పి.గన్నవరం: నరేంద్రపురం గురుకుల కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో 93 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ తెలిపారు. సీనియర్ ఎంపీసీలో పెందుర్తి విజయకుమార్ 937, కుసుమ సత్య సంతోష్ 929, మద్దాల సాయితేజ శ్రీరామ్ 831 మార్కులు సాధించారని వివరించారు.

ఫైర్ స్టేషన్ నిర్మాణానికి స్థలం అప్పగింత

పి.గన్నవరం: పోతవరంలో అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి అవసరమైన 12 సెంట్ల స్థలాన్ని ఆ శాఖ అధికారులకు తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ గురువారం అప్పగించారు. నియోజకవర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.1.2 కోట్లతో అగ్నిమాపక కేంద్రం మంజూరు చేసిన విషయం విదితమే. దీనిని పోతవరంలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే చిట్టిబాబు నిర్ణయించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అనుకుని ఉన్న పాత పీచు ఫ్యాక్టరీకి చెందిన 12 సెంట్ల స్థలాన్ని అగ్నిమాపక కేంద్రానికి కేటాయించారు. అగ్నిమాపక కేంద్ర నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని రీజినల్ ఫైర్ ఆఫీసర్ ఇ.స్వామి ఈ సందర్భంగా చెప్పారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ సీహెచ్ మార్టిన్ లూథర్ కింగ్, పోలీస్ హౌసింగ్ బోర్డు ఏఈ వలీ, సర్పంచ్ వడలి కొండయ్య, ఇన్‌చార్జి ఆర్‌ఐ కె.తులసీరావు, అమలాపురం ఫైర్ ఆఫీసర్ కేవీ మురళీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.